రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

తిర్యాణి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 3, 4 తేదీల్లో హనుమకొండలో జరుగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తిర్యాణి ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు చంద్రకాంత్, వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చాలని ఏటీడీవో చిరంజీవి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఏసీఎంవో ఉద్దవ్, డీఎస్‌వో మీనారెడ్డి, సాయిబాబా, తదితరులు అభినందించారు.

మట్కా రాయుళ్లపై కేసు నమోదు

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మార్కెట్‌లో ఏరియాలో మట్కా ఆడుతున్న పలువురిపై కేసు నమోదు చేసినట్లు కాగజ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ప్రేం కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గాంధీచౌక్ ఏరియాలో మట్కా ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై సుధాకర్, పోలీసులు సిబ్బంది తనిఖీలు చేపట్టారన్నారు. ఖాజా, కొట్రంగి శంకర్, గుర్లె పోచయ్య, బెండారె శివరాం, షేక్ ఖలీలుద్దీన్, నగోసె రవి, సయ్యద్ కమ్రుద్దీన్, ఎనగంటి స్వామి మట్కా ఆడుతూ పట్టుబడ్డారన్నారు. నిందితుల వద్ద నుంచి 5,240 రూపాయలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రేం కుమార్ వివరించారు.



పొలం బడిలో సేద్యం పాఠాలు

వీరంతా పాఠశాల విద్యార్థులు.. నిత్యం పాఠశాల గదుల్లో కూర్చుని బోర్డుపై పాఠాలు వినే చిన్నారులు.. పొలంలో గంతులేస్తూ సరదాగా కొత్త పాఠం విన్నారు. వరిసాగు గురించి పుస్తకాల్లో చదవడమే తప్ప ఎలా పండిస్తారో చాలా మందికి తెలియదు. ఆ విషయాలను తెలుసుకునేందుకు బెజ్జూరు మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే విద్యాలయం విద్యార్థులు 'ఒక రోజు రైతు'(వన్డే కిసాన్) కార్యక్రమంలో భాగంగా శనివారం పొలం పాఠాలు నేర్చుకున్నారు. ఉపాధ్యాయులు మౌనిక, శ్రీనివాస్ విద్యార్థులకు రైతులు పడే కష్టాలు, సాగు చేసే విధానం, విత్తనాలు నాటడం, కలుపు తీయడం, పంట కోత తదితర విషయాలపై అవగాహన కల్పించారు. -బెజ్జూరు (ఆంధ్రజ్యోతి)





'ఉపాధి' చదువులు

- ప్రభుత్వ పాఠశాలల్లో వృత్తివిద్య
- కొత్తగా 19 కోర్సులు ప్రారంభం
- స్వయం ఉపాధి కల్పనే లక్ష్యంగా బోధన
- జిల్లాలో 11 పాఠశాలల్లో అందుబాటులో కోర్సులు

బెజ్జూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో వృత్తివిద్య కోర్సులను మరింతగా అందుబాటులోకి తీసుకరావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకు విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల లభ్యత, వృత్తివిద్యా కోర్సుల అధ్యయనానికి సామగ్రి అమర్చేందుకు తగిన వసతులు ఉన్న పాఠశాలలను గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా 241 ఎంపిక చేసింది. ఇందులో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 11 పాఠశాలలు ఉన్నాయి. జిల్లాలోని ఆసిఫాబాద్, చింతలమానేపల్లి, జైనూరు, కాగజ్‌నగర్, కెరమెరి, కౌటాల, పెంచికలపేట, రెబ్బెన, వాంకిడి పాఠశాలలను ఎంపిక చేశారు.

● 19 రకాల వృత్తి కోర్సులు..

మొత్తం 19 రకాల వృత్తివిద్య కోర్సులు అందుబాటులో ఉంచి పదో తరగతి వరకు ఉన్న పాఠశాలలకు వాటిలో రెండు కోర్సులను ఎంచుకోవాలని ప్రభుత్వం సూచించింది. పదోతరగతి పూర్తయిన తర్వాత స్వయం ఉపాధి కల్పించే జనాదరణ పొందిన కోర్సులు అందిస్తారు. ఇందుకు అర్హతలున్న బోధకులను నియమిస్తారు. విద్యార్థుల ఆసక్తి మేరకు అదే ఆవాసంలో లేదా సమీప పట్టణంలో మంచి ఆదరణ కలిగిన రెండు కోర్సులను ఎంచుకొని తమకు సమాచారం అందిస్తే అందుకు తగిన ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తుంది. పదో తరగతి కీలకం కావడంతో రెగ్యులర్ తరగతుల బోధనకు అంతరాయం కలగకుండా అదనపు సమయంలో వృత్తి విద్య కోర్సులు నేర్పిస్తారు. పాఠశాల బోధనతో పాటు ప్రాక్టికల్ తరగతులు నిర్వహిస్తారు. వ్యవసాయానికి సంబంధించిన కోర్సుల్లో క్షేత్ర సందర్శన కూడా ఉంటుంది. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరుల ఆధారంగా కోర్సులను ఎంపిక చేసుకునే బాధ్యత ఆయా పాఠశాలల ఉపాధ్యాయులదే. పదో తరగతి వరకు ఉన్న పాఠశాలల్లో రెండు దశల్లో వృత్తివిద్య బోధిస్తారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు లెవల్-1పేరిట ఏదైనా కోర్సు నేర్చుకోవాలని మానసికంగా సిద్ధం చేస్తారు. రెండో దశలో విద్యార్థులు కిందటి తరగతిలో పేర్కొన్న కోర్సుకు తగిన శిక్షణపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తారు. పదో తరగతి వార్షిక పరీక్షలు ముగిసే నాటికి విద్యార్థులు నేర్చుకున్న అంశంలో పట్టు సాధించేలా శిక్షణ ఇస్తారు. మిగతా రెండు దశలను ఇంటర్ వరకు ఉన్న విద్యా సంస్థల్లో అమలు చేస్తారు.

కొత్త కోర్సులు ఇవే..

- అగ్రికల్చర్ టెక్నాలజీ
- బ్యూటీషియన్
- ఎలక్ట్రికల్ వైరింగ్
- ఐటీ టెక్నాలజీ
- హోమ్ ఫర్నీచర్
- మీడియా ఎంటర్‌టైన్‌మెంట్
- ప్లంబింగ్, స్పోర్ట్స్
- ఫిజికల్ ఎడ్యుకేషన్
- బ్యాంకింగ్
- ఫైనాన్షియల్ సర్వీస్ అండ్ ఇన్సూరెన్స్
- ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్
- ఫుడ్ ప్రాసెసింగ్
- హెల్త్ కేర్
- టూరిజం అండ్ హాస్పిటాలజీ
- ఆటోమోటివ్
- రిటైల్ మార్కెటింగ్

● నైపుణ్యాలు లేక....

నైపుణ్యాలు లేకపోవడంతో ఎంతో మంది గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ పట్టభద్రులు నేడు ఉపాధికి నోచుకోలేకపోతున్నారు. అలాగని మార్కెట్‌లో అవకాశాలు లేవని కాదు. కావల్సిందల్లా వాటిని ఒడిసిపట్టుకునేందుకు కావాల్సిన నైపుణ్యాలే అని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. చదువుతో పాటు భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా స్కిల్స్ నేర్చుకుంటున్న వారిని గ్లోబల్ కంపెనీలు వెతికి మరీ పట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చి దిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రపంచ వ్యాప్త డిమాండ్‌కు తగ్గట్టుగా వృత్తివిద్య కోర్సులను బోధిస్తుంది. విద్యార్థులకు పదో తరగతితో పాటు వృత్తివిద్యను నేర్పిస్తే చదువు పూర్తయిన తర్వాత స్వయం ఉపాధితో ఆర్థికంగా నిలదొక్కు కునే అవకాశముంటుంది. ఈ ఆలోచనతోనే పదేళ్ల క్రితం ఆదర్శ పాఠశాలల్లో వృత్తివిద్య కోర్సులు ప్రవేశ పెట్టారు. ప్రస్తుత ప్రభుత్వం వీటిని కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, పీఎం శ్రీ పాఠశాలలకూ విస్తరిస్తోంది. ఒక్కో బడిలో రెండేసి కోర్సులు ప్రవేశపెడుతున్నారు.

● పలు అవకాశాలు..

ఇంటర్ ఒకేషనల్ కోర్సుగాని, ఐటీఐ పూర్తి చేసిన తర్వాత ఉన్నత విద్య అభ్యసించేందుకు విద్యార్థులకు అవకాశాలు ఉన్నాయి. ఒకేషనల్ వారు జనరల్ విద్యార్థులతో సమానంగా బీఏ, బీకాం, డిగ్రీల్లో ప్రవేశాలు పొందవచ్చు. బ్రిడ్జీ కోర్సుతో బీఎస్సీ డిగ్రీ చేయవచ్చు. ఇంటర్ ఒకేషనల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ఉత్తీర్ణులైనవారు నేరుగా పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో చేరే అవకాశం ఉంటుంది. రెండేళ్ల ఒకేషనల్ పూర్తి చేసిన వారు బ్రిడ్జీ కోర్సుతో నేరుగా ఎప్‌సెట్‌కు కూడా హాజరుకావచ్చు.

జీవితంలో స్థిరపడవచ్చు...

- ఉప్పులేటి శ్రీనివాస్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి



పాఠశాలల్లో ప్రారంభించిన వృత్తివిద్య కోర్సుల్లో చేరి విద్యనభ్యసించిన వారు వృత్తివిద్య ద్వారా జీవితంలో స్థిరపడవచ్చు. సులభంగా వృత్తివిద్యను చదవడం ద్వారా భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రాబోయే రోజుల్లో వృత్తివిద్యకు మంచి ప్రాధాన్యం ఉంటుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

సంపూర్ణత అభియాన్‌లో జిల్లా అత్యుత్తమం



కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు అవార్డు అందజేస్తున్న గవర్నర్

ఆసిఫాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహణలో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా అత్యుత్తమంగా నిలిచింది. శనివారం రాష్ట్ర రాజధాని హైదారాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గల దర్బార్ మందిరంలో సంపూర్ణత అభియాన్‌లో అత్యుత్తమ సేవలు అందించిన కుమరం భీం జిల్లా తరపున కలెక్టర్ వెంకటేష్ దోత్రే రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

ఖైదీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ కె యువరాజ


ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ కె యువరాజ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా సబ్ జైలులో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొని ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. క్షణికావేశంలో ఎటువంటి దాడులకు పాల్పడకుండా చట్టం ప్రకారం నడుచుకోవాలన్నారు. నేరాలకు పాల్పడకూడదని, డ్రగ్స్ గంజాయి సాగు చేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. గంజాయిని సాగు చేసిన వారు శిక్షార్హులవుతారని అన్నారు. అనంతరం జైలులోని వంట గది, వంట సామగ్రిని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత ఆశ్రమ బాలుర పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.

ఉచిత కుట్టు శిక్షణ శిబిరం

కాగజ్‌నగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఎస్పీఎం మిల్లు సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ఈ నెల 13 నుంచి నిర్వహిస్తున్నట్టు స్పర్శ ఫౌండేషన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్పీఎం కన్జూమర్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్న ట్టు వారు తెలిపారు. ఈ కోర్సు 45 రోజుల పాటు ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 9866257509, 8374727709లో సంప్రదించాలని సూచించారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

కౌటాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, నాగెపల్లిలోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ హనుమంతు సందర్శించారు. ఈ సందర్భంగా నాగెపల్లిలో విద్యార్థులకు కృత్యాధార బధన చేస్తూ విద్యార్థులతో మమేకమై వారితో పాటు నేలపై కూర్చోని వివరిస్తున్న ఉపాధ్యాయుడు రామాగౌడ్‌ను అభినందించారు. అదే విధంగా విద్యార్థులు నేర్చుకుంటున్న తీరు చాలా అద్భుతంగా ఉందని హెచ్‌ఎం గణపతి, ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు కొద్ది సేపు పాఠాలు బోధించారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఎంఈవో హనుమంతు

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

- ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్



వనమహోత్సవంలో పాల్గొన్న అటవీ అధికారులు, విద్యార్థులు

సిర్పూర్(టి), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా మొక్కలు దాటుదాం-పర్యావరణాన్ని కాపాడుకుందాం అని ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని ఇటుకలపహాడ్ గ్రామంలో వనమహోత్సవంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన ఆహ్లాదకరమైన వాతావరణం కోసం నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రతీ ఒక్కరు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాఆట్లాడుతూ అడవిలో వివిధ నీటి కుంటలు, అడవి జంతువుల అడుగులను చూపించి జీవ వైవిధ్యం ఆవశ్యకతను దాని కోసం అటవీ అధికారులు చేస్తున్న కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్‌లు మోహన్‌రావు, మోతిలాల్, అతారుద్దీన్, వందన, బీట్ ఆఫీసర్లు లక్ష్మి, సంతోష్, మల్లికార్జున్, అరవింద్, నరేష్, అరుణ్ పాల్గొన్నారు.

ఏపీఎంగా మోహన్‌దాస్ బాధ్యతల స్వీకరణ

బెజ్జూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు ఏపీఎంగా మోహన్‌దాస్ శనివారం బాధ్యత లు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన ఏపీఎం మోహన్‌లాల్ చింతలమానేపల్లికి బదిలీ కాగా ఆయన స్థనంలో జగిత్యాల జిల్లా బుగ్గారంకు చెందిన ఏపీఎం మోహన్‌దాస్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీసీలు, వీఓఏలు సంతోష్, శంకర్, సురేష్ ఉన్నారు.

కెరమెరి (ఆంధ్రజ్యోతి): కెరమెరి ఏపీఎంగా ముక్తేశ్వర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన జగదీష్ ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో కౌటాలలో పని చేస్తున్న ముక్తేశ్వర్ కెరమెరికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ను పలువురు సీసీలు, మహిళా సమాఖ్య సభ్యులు సన్మానించారు.

రెబ్బెన (ఆంధ్రజ్యోతి): ఐకేపీ విభాగంలో ఏపీఎం వెంకటరమణ బదిలీపై వెళ్తుతున్న సందర్భంగా సిబ్బంది శనివారం ఘనంగా శాలువాలతో సన్మానం చేశారు. అలాగే సిర్పూరు(టి) నుంచి రెబ్బెనకు ఎంపీఎంగా వచ్చిన దుర్గయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు వనిత, శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



చింతలమానేపల్లిలో మాట్లాడుతున్న సీఐ సంతోష్‌కుమార్

చింతలమానేపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సీఐ సంతోష్‌కుమార్ సూచించారు. చింతలమానేపల్లి మండలంలోని బాబాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్పీ కాంతిలాల్, ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు షీ టీం ఆధ్వర్యంలో 'బాలికల భద్రత, విద్య వల్ల జీవిత విజయం' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సంతోష్‌కమార్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండాలని, క్రమశిక్షణతో మెలగాలని, శ్రద్ధాసక్తులతో విద్యను అభ్యసించాలని సూచించారు. బాలికలకు ఇతర కారణాల వల్ల ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పాఠశాల ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు తెలిపాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్, ఉపాధ్యాయులు, షీ టీం సభ్యులు స్వప్న, రజిని, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరిలో...

కెరమెరి (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోడి కేజీబీవీలో షీ టీం ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం ఇన్‌చార్జి సునీత విద్యార్థినులకు భద్రత చట్టాలు, ఆపద సమయంలో ఎలా స్పందించాలి, డయల్ 100, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే షీ టీం 8712670564(ఆసిఫాబాద్), 8712670565 (కాగజ్‌నగర్) సంప్రదించాలని సూచించారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు అందించాలి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి/రెబ్బెన ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం రేషన్‌కార్డులు అందించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. శనివారం వాంకిడి మండల కేంద్రంలో, రెబ్బెన రైతు వేదికలో అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని అమాయక ప్రజలకు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడం తెలియక అనేక మంది నిరుపేదలు నేటికీ దరఖాస్తులు చేసుకోలేదన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతీఒక్కరికి రేషన్‌కా ర్డులు అందించేలా అధికారులు చూడాలన్నారు. కొత్తగా రేషన్‌కార్డులు పొందిన లబ్ధిదారులకు వచ్చే నెల నుంచి బియ్యం అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సంక్షేమ పథకా నికి రేషన్‌కార్డులు తప్పనిసరని ప్రజలు సద్వినియో గం చేసుకోవాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ డేవిడ్ మాట్లాడుతూ వాంకిడి మండలంలో మొత్తం 1,892 రేషన్‌కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. కార్డులు రానివారు ఆందోళన చెందవద్దని దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు అందిస్తామని దీమా కల్పించారు. ప్రభుత్వం నిరుపేదలకు సన్న బియ్యం అందిం స్తోందని ప్రజలు సన్న బియ్యంను విక్రయించకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు దరఖాస్తు చేయని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ జాబిరే పెంట య్య, తహసీల్దార్ కవిత, డీటీ రాంలాల్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.





వాంకిడి, తిర్యాణిలో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ డేవిడ్

రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

తిర్యాణి(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ డేవిడ్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో లబ్ధిదారులకు రేషన్ కార్డులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 508 నూతనకార్డులు మంజూరుకాగా, 390 మందికి మార్పులు, చేర్పులు చేశామని తెలిపారు. కార్డుల ద్వారా అర్హులైన వారందరికి సన్న బియ్యం అందజేస్తామన్నారు. రేషన్ బియ్యం అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో పని చేస్తున్న రేషన్ సేల్స్‌మెన్, డీలర్లు, లబ్ధిదారులకు నిర్ణీత గడువులోగా సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్యాంనాయక్ మాట్లాడు తూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు ఎరగని నిరుపేదలు ఎంతో మంది ఉన్నారని పేర్కొన్నారు. కార్డులు మంజూరు అయిన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వర్, డీఎఫ్‌వో జాదేవ్, తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ వంశీకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన కలిగి ఉండాలి

వాంకిడి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు సేవలపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జోషి పేర్కొన్నారు. శనివారం మండలంలోని సవ్వాతి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి వాటి ద్వారా లావాదేవీలు చేయకపోవడం వల్ల బ్యాంకు ఖాతాలు నిలిచిపోయే అవకాశం ఉంటుందన్నారు. బ్యాంకు ఖాతాలు నిలిచిపోయి ఉంటే వినియోగదారులు బ్యాంకుకు వచ్చి కేవైసీ చేసుకుంటే తిరిగి లావాదేవీలు ప్రారంభం అవుతాయన్నారు. బ్యాంకు ఖాతాలు ఉన్న ప్రతి ఒక్కరికి అన్ని సంక్షేమ పథకాలకు ఈ ఖాతా ఉపయోగపడుతుందన్నారు. బ్యాంకు ఖాతాలు కలిగిన ప్రతీఒక్కరు బీమా చేసుకోవడంవల్ల రెండు లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ప్రజలు బ్యాంకు ఖాతాలను తెరిచి బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బ్యాంక్ మేనేజర్ నందకిషోర్ పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై నేడు సమావేశం

జైనూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వాహణ కోసం స్థానిక మార్కెట్ యార్డులో ఆదివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మడావి మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాలకు చెందిన తొమ్మిది తెగల ఆదివాసులు తప్పక హజరుకావాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

దహెగాం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోనిని కేజీబీవీ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్వో జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 34, బైపీసీలో రెండు సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

పత్తి రైతులకు కలుపు కష్టాలు

- ఇటీవల కురిసిన వర్షాలకు పెరిగిన గడ్డి
- కూలీలకు డిమాండ్
- ఆందోళనలో అన్నదాతలు



పత్తి చేనులో కలుపు తీస్తున్న మహిళా రైతులు

కెరమెరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో పత్తి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా వర్షం కురుస్తుండడంతో పత్తి చేలల్లో గడ్డి అధికమై రైతులకు కలుపు కలవరపెడుతోంది. చౌకలు కూడా పొలాల్లో నడిచే వీలు లేకుండా వ్యవసాయ క్షేత్రాలు మారాయి. పొలాల్లో నీరు నిలిచి ఉండడంతో పొలం పనులు కాస్త మందగించాయి. మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో 8,210 మంది రైతులు ఉండగా 29,327 ఎకరాల్లో వివిధ పంటలు పండిస్తున్నారు. ఇందులో అత్యధికంగా 26,230 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు.

● పెరిగిన గడ్డితో ఇబ్బందులు..

ప్రస్తుతం మండలంలో ఎటూ చూసినా పత్తి పంట కనిపిస్తోంది. కానీ పత్తి చేనులో పత్తితో పాటు గడ్డి మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయం కాలం ఎప్పుడు పడితే అప్పుడు వానలు కురుస్తున్నాయి. దీంతో కూలీలకు వర్షం అడ్డంకిగా మారింది. కాగా కూలీలు కూడా పత్తితో పాటు పెరిగిన గడ్డిని చూసి గుత్తా మాట్లాడుతున్నారు. ఒక ఎకరానికి ఐదు వేల రూపాయల నుంచి ఎనిమిది వేల రూపాయల వరకు డిమాండ్ చేస్తున్నారు. రోజు కూలి అయితే ఒక కూలీకి 300 రూపాయల నుంచి 400 రూపాయల వరకు అడుగుతున్నారు. దీంతో ఏం చేయాలో తోచక కొంత మంది రైతులు గడ్డి మందు పిచికారీ చేస్తున్నారు. మందు పిచికారీతో పంటకు కొంత నష్టం కలుగుతుందని భావించి మరికొందరు ఖర్చుకు వెనకాడకుండా కూలీలతో కలుపు తీయిస్తున్నారు. ఇప్పుడిప్పుడే పత్తి పంట ఎదుగుతున్న దృష్ట్యా ప్రారంభంలోనే వేలల్లో పత్తి పంటకు ఖర్చు పెడితే రానున్న రోజుల్లో ఇంకెంత భారమవుతాయోనని రైతులు ఆవేదన చెందుతున్నారు.

డిమాండ్ పెరిగింది.. రమేష్, రైతు, గోయగాం



ప్రస్తుతం కురుస్తున్న వానలకు పత్తి చేలలో బాగా గడ్డి పెరిగింది. దీంతో కూలీలు అధికంగా డిమాండ్ చేస్తున్నారు. రోజు కూలి 300 రూపాయల నుంచి 400 రూపాయల వరకు ఇవ్వాల్సి రావడంతో కష్టాలు తప్పడంలేదు. గుత్తాగా మాట్లాడితే వేలల్లో ఖర్చవుతుంది.



పత్తి సాళ్లలో దౌర కొడుతున్న రైతు

కిక్ బాక్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

కౌటాల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పట్టణలోని ఎల్‌బీ స్టేడియంలో జరిగిన ఖేలో ఇండియా ఆస్మిత కిక్ బాక్సింగ్ లీగ్ పోటీల్లో కౌటాల కేజీబీవీ విద్యార్థులు ప్రతిభకనబర్చినట్లు ఎంఈఓ హన్మంతు తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థినులు శైలజ, సంధ్య, సుప్రియ, కేత, జనవి, దీక్షితలు మూడు గోల్డ్, ఒక సిల్వర్, అయిదు బ్రోజ్ మోడల్స్ సాధించినట్లు తెలిపారు. వీరిని ఎంఈఓతో పాటు కుంగ్‌ఫూ మాస్టర్ అంజన్న, ఎస్ఓ పవిత్ర, పీఈటీ సౌందర్య, ఉపాధ్యాయులు అభినందించారు.

పింఛన్‌దారుల సమావేశాలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కౌటాల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 4న ఆసిఫాబాద్‌లో, 13న హైదరాబాద్‌లో నిర్వహించే పింఛన్‌దారుల సమావేశాలను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. శనివారం మండలంలోని తుమ్మిడిహెట్టిలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, సంపత్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



యూరియా కోసం క్యూలైన్‌లో వేచిఉన్న రైతులు

దహెగాం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శనివారం పోలీసు పహారా మధ్య యూరియాను పంపిణీ చేశారు. యూరియా పంపిణీ చేస్తున్నట్లు సమాచారం తెలియగా ఇటిక్యాల, గొర్రెగుట్ట, దేవాజీగూడ, మర్రిపల్లి, దహెగాం, లగ్గాం తదితర గ్రామాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారుజ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎస్సై విక్రమ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య ఎరువుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి బక్కయ్య, సిబ్బంది నారాయణ, జీవన్, సాయి పాల్గొన్నారు.

మామిడిగూడలో వైద్య శిబిరం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



మామిడిగూడలో పర్యటిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్ రాజ్

కాసిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మామిడిగూడలో విజృంభిస్తున్న జ్వరాలు అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీనికి స్పందించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ బృందం శనివారం మామిడిగూడలో పర్యటించి వైద్య శిబిరం నిర్వహించారు. జ్వర పీడితుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జ్వరాలు అదుపులోకి వచ్చేంత వరకు మామిడిగూడలో వైద్య శిబిరం కొనసాగుతుందని గ్రామస్థులకు భరోసా కల్పించారు. వైద్య శిబిరంలో 48 మంది నుంచి రక్తనమూనాలు సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పంచాయతీరాజ్ సిబ్బంతితో సమన్వయం చేసుకుంటూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

కాసిపేట కాలేజీకి సింగరేణి నీటి సరఫరా

కాసిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాలుగు రోజులుగా తాగునీరు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. దీంతో కాలేజీలో తాగునీటికి తీవ్ర కటకట నెలకొంది. కాలేజీ ప్రిన్సిపాల్ శంకర్, డీఐఈవో అంజయ్య, సింగరేణి జీఎం కాసిపేట గని మేనేజర్‌కు తాగునీటి సమస్యను వివరించారు. దీంతో స్పందించిన సింగరేణి యాజమాన్యం నీటి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు. మోటార్ మరమ్మతులు చేసేంత వరకు సింగరేణి ఆధ్వర్యంలో నీటి సరఫరా చేస్తామని మేనేజర్ సతీష్ హామీ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలలో వసతులు కల్పించాలి

బెల్లంపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో 24వ వార్డు అంబేద్కర్ రడగం బాల బస్తీలో ఉన్న మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలో వసతులు కల్పించాలని కోరుతూ ఆర్డీవో హరిక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ రమేశ్‌లకు ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలకు ప్రహరిలేకపోవడంతో వీధి కుక్కల తోపాటు పందులు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయన్నారు. వంట గది లేకపోవడంతో మధ్యాహ్న భోజన అమలు ఇబ్బందిగా ఏర్పడుతుందన్నారు. నాయకులు రామగిరి మహేశ్, రాజేశ్, చంద్రశేఖర్, ధర్మేందర్, ఐలయ్య పాల్గొన్నారు.

తల్లిపాలతో రోగ నిరోధకశక్తి పెరుగుతుంది

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని, తల్లిపాలతో పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెంటుబాయి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం న్యూరాజంపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు తాగడం వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కీర్తి, అంగన్‌వాడీ టీచర్ వనిత, సునీత పాల్గొన్నారు.

రెబ్బెన (ఆంధ్రజ్యోతి): ముర్రుపాలతో బిడ్డకు సురక్షగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కె కళావతి తెలిపారు. శనివారం కొండపల్లిలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. ముర్రుపాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మమత,



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి

పద్మ, రాజేశ్వరి సంతోషి, సుజాత, తారా తదితరులు పాల్గొన్నారు.

జైనూర్ (ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రు పాలు తాగించడం శ్రేయస్కరమని జైనూర్ ఐసీడీఎస్ సీడీపీవో ఇందిర అన్నారు. మండలంలోని గౌరి అంగన్ వాడీ కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలు బి విమల, సురేఖ, సూపర్ వైజర్ సోంబాయి తదితరులు ఉన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో మెనూ పాటించాలి

కెరమెరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) సంక్షేమ హాస్టళ్లలో మెనూ పాటించాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. శనివారం వెడి కేజీబీవీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న భోజనంను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. అనంతరం అంతాపూర్, బోలాపటార్ తదితర గ్రామాల్లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మణాలను పరిశీలించారు. వారి వెంట కార్యదర్శులు ఉన్నారు.



కేజీబీవీలో కూరగాయలను పరిశీలిస్తున్న ఎంపీడీవో



ఆర్‌కే 5.. అన్ని గనులకు ఆదర్శం



ఉద్యోగికి బహుమతి అందిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఏరియాలోని అన్ని గనులకు ఆర్‌కే 5 గని ఆదర్శంగా నిలుస్తోందని జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. ఆర్‌కే 5 గని వంద శాతం ఉత్పత్తి సాధించిన సందర్భంగా గని ఆవరణలో ఉద్యోగులకు బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్పత్తి, రక్షణ, ఇతర సామాజిక కార్యక్రమాల్లో గని ఉద్యోగులు ముందంజలో ఉన్నారని తెలిపారు. తక్కువ ఎత్తులో ఉన్న పని ప్రదేశాల్లో సైతం నిబద్ధతతో కృషి చేస్తూ ఇప్పటివరకు ఎలాంటి ప్రమాదం జరుగకుండా జూలై నెలలో వంద శాతం ఉత్పత్తి సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం ఏ రిలే ఉద్యోగులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, మేనేజర్ సుధీర్ కుమార్ ఝా, గ్రూప్ ఇంజనీర్ శ్రీనివాస్ భట్టాచార్య, రక్షణాధికారి శివయ్య, సంక్షేమాధికారి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు కాపాడేందుకు కృషి

శ్రీరాంపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులు కాపాడేందుకు తమ యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లేబర్ కమిషనర్ వద్ద నిర్వహించిన సమావేశంలో కార్మికుల పక్షాన పలు అగ్రిమెంట్లు చేసుకున్నట్లు తెలిపారు. జేఎంఈటీలను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవడం, అన్‌ఫిట్ అయిన సూపర్‌వైజర్లకు సూటబుల్ జాబ్ ఇవ్వడానికి ఒప్పుకున్నారన్నారు. ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన 40 వేల కోట్ల రూపాయలు ఇప్పించేందుకు ప్రజాప్రతినిధులు ఒత్తిడి తేవాలని కోరారు. శ్రీరాంపూర్‌లో క్వార్టర్‌లో నివసించేవారికి వద్దనుకుంటే కార్మికులకు క్వార్టర్ వెకేషన్ సర్టిఫికెట్ ఇస్తుందని, త్వరలో సర్క్యులర్ వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోత్కూరి కొమురయ్య, జీఎం చర్చల ప్రతినిధులు ప్రసాద్ రెడ్డి, బద్రి బుచ్చయ్య, పిట్ కార్యదర్శి తిరుపతి, సహాయ కార్యదర్శి సాయిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

ప్రమాదాల నివారణకు ప్రపంచస్థాయి పరిజ్ఞానం

● సింగరేణి రక్షణకు సంబంధించి సీఎం దృష్టికి తీసుకెళ్తా ● ప్రమాదంలో మృతిచెందిన ఉద్యోగి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ● మంత్రి వివేక్

మందమర్రిటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సంస్థలో ఉద్యోగుల రక్షణకు సంబంధించి ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని, రక్షణకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రమాదాలు లేని సింగరేణియే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. సింగరేణిలో రక్షణకు సంబంధించిన అంశాలను, జరిగిన ప్రమాద తీరును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సింగరేణి డైరెక్టర్‌ల స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతానని తెలిపారు. శనివారం మందమర్రి ఏరియాలోని కేకే 5 గనిని ఆయన సందర్శించారు. శుక్రవారం గని ప్రమాదంలో శ్రావణ్‌కుమార్ అనే కార్మికుడు మృతిచెందగా ఈ సంఘటనపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గని వద్ద మంత్రి మాట్లాడారు. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించి ఎప్పటికప్పుడు యాజమాన్యం రక్షణ విషయంలో ముందుండాలన్నారు. సింగరేణిలో కాలపరిమితి పూర్తయిన ఎస్‌డీఎల్ యంత్రాలను ఎందుకు నడుపుతున్నారో అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ సంవత్సరం కోట్ల రూపాయల లాభాలను తీసుకువస్తున్న ఉద్యోగులకు బొగ్గు ఉత్పత్తికి ఉపయోగించే యంత్రాలు సక్రమంగా ఉండాలనే విషయాన్ని యాజమాన్యం ఎలా మర్చిపోతుందోనన్నారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ఉద్యోగులు ముందుంటున్నందున వారు ఉపయోగించే పరికరాలు నాణ్యమైనవిగా ఉండాలన్నారు. దీనిపై సీఎండీ బలరాంతో మాట్లాడానని, ఎస్‌డీఎల్ యంత్రాల గురించి వివరించానని తెలిపారు. ప్రమాదంలో మృతిచెందిన గని కార్మికుడు శ్రావణ్‌కుమార్ కుటుంబంలో ఒకరికి సూటబుల్ ఎంప్లాయిమెంట్ ఇవ్వాలని జీఎంను ఆదేశించామన్నారు. కంపెనీ నుంచి రావాల్సిన బెనిఫిట్స్‌ను సకాలంలో అందించాలన్నారు. త్వరలోనే గనుల్లో ఉత్పత్తికి సంబంధించిన పని ప్రదేశాలను సందర్శిస్తానని మంత్రి తెలిపారు. సింగరేణి ఉద్యోగుల విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తామన్నారు. ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. రక్షణ విషయంలో యాజమాన్యం వెనకడుగు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. గని ప్రమాదాల్లో గాయపడిన కార్మికులకు యాజమాన్యం మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి కృషి చేస్తానని తెలిపారు. ప్రమాదంలో మృతిచెందిన కార్మికుని కుటుంబానికి అండగా ఉంటామన్నారు. మంత్రి వెంట ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, నాయకులు సలేంద్ర సత్యనారాయణ, సుదర్శన్, ఐఎన్‌టీయూసీ నాయకులు ప్రసాద్, రామకృష్ణ, పవన్ తదితరులు ఉన్నారు.



గనిని పరిశీలిస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

మృతుడి కుటుంబానికి రూ.15.95 లక్షల చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న అధికారులు

మందమర్రిటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలోని కేకే 5 గని ప్రమాదంలో మృతిచెందిన కార్మికుడు శ్రావణ్‌కుమార్ కుటుంబానికి స్పెషల్ ఎక్స్‌గ్రేషియా డబ్బులు రూ. 15 లక్షలు, ఎక్స్‌గ్రేషియా అమౌంట్ రూ. 90 వేలు, దహన సంస్కారాలకు ఐదు వేల రూపాయలు మొత్తం రూ.15.95 లక్షల చెక్కును అధికారులు అందజేశారు. కరీంనగర్ జిల్లాలోని మృతుడి స్వగ్రామమైన చంబుపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. అధికారులు అంత్యక్రియలకు హాజరై చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ పీవో మాస్కుల కార్తీక్, జీశా, పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

డ్యూటీ చెయ్యలే... జీతమూ రాలే..

- హయ్యర్ రిఫరల్ కార్మికుల ఆవేదన
- ఒక్కొక్కరికి రూ. లక్షల్లో నష్టం

శ్రీరాంపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆ కార్మికులకు అసలే అనారోగ్యం.. అన్‌ఫిట్ కోసం మెడికల్ బోర్డుకు వెళ్లారు. అధికారులు వారిని హయ్యర్ రిఫరల్ కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు రాశారు. ఇంతలో మెడికల్ బోర్డు బంద్ అయ్యింది. దీంతో అటు డ్యూటీ చెయ్యడం వీలుకాలేదు. ఇటు వేతనమూ రాలేదు. గురువారం మెడికల్ బోర్డు ఏర్పాటు చేయగా.. అందులో చాలా మందికి ఫిట్ ఫర్ సేమ్ డ్యూటీ ఇవ్వడంతో ఆయా కార్మికులు ఆర్థికంగా నష్టపోయి తీవ్ర ఆవేదన చెందుతున్నారు. సింగరేణి కార్మికులు తమ వారసులకు ఉద్యోగాలు ఇచ్చేం దుకు కారుణ్య నియామక పద్ధతి ఉంది. ఇందులో భాగంగా అనారోగ్యం కలిగిన కార్మికులు మెడికల్ బోర్డుకు వెళ్లి అన్‌ఫి ట్ అయితే వారి పిల్లలకు సంస్థలో ఉద్యోగం లభిస్తుంది.

హయ్యర్ రిఫరల్‌తో గందరగోళం

సాధారణంగా సింగరేణి కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రిలో ఏర్పాటు చేసే మెడికల్ బోర్డులోనే ఫిట్ లేదా అన్‌ఫిట్ చేస్తారు. కానీ కొందరిని హయ్యర్ రిఫరల్‌కు (కార్పొరేట్ ఆస్పత్రిలో పరీక్ష చేసేందుకు) పంపి వైద్య పరీక్షలు చేయిస్తారు. రిపోర్టు ఆధారంగా కార్మికులను ఫిట్/అన్‌ఫిట్ చేస్తారు. ఇటీవల పంపినవారిలో 55 మంది ఉన్నారు.

ఏసీబీ దాడులతో ఆలస్యం

ప్రతీ నెల ఒకసారి మెడికల్ బోర్డు ఏర్పాటు చేస్తారు. కానీ మెడికల్ బోర్డులో అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందడంతో ఏసీబీ, సింగరేణి విజిలెన్స్ విభాగాలు దాడులు చేశాయి. ఈ క్రమంలో చివరగా మార్చిలో మెడికల్ బోర్డు నిర్వహించగా, అప్పటి నుంచి మళ్లీ ఏర్పాటు చేయలేదు. దీంతో హయ్యర్ రెఫరల్స్‌కు పంపిన కార్మికుల పరిస్థితి డోలాయమానంలో పడింది. హయ్యర్ రెఫరల్‌కు వెళ్లిన 55 మందిలో చాలా మంది సీనియర్లు ఉండడంతో వారికి రూ.లక్షల్లో వేతనాలు ఉంటాయి. కానీ మెడికల్ బోర్డు ఏర్పాటు కాకపోవడంతో అటు డ్యూటీకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా వేతనాలు పొందలేదు. ఒక్కొక్కరు సుమారు సుమారు 15 లక్షల రూపాయల నుంచి 20 లక్షల రూపాయల వరకు నష్టపోయారు.

ఫిట్ ఫర్ సేమ్ జాబ్.. నిరాశలో కార్మికులు

ఇలాంటి పరిస్థితుల్లో గురువారం మెడికల్ బోర్డు జరిగింది. 55 మంది కార్మికుల్లో ముగ్గురు అన్‌ఫిట్ కాగా, 52 మందికి ఫిట్ ఫర్ సేమ్ జాబ్ అని ఇచ్చారు. దీంతో వారంతా హతాశులయ్యారు. రూ.లక్షల్లో నష్టపోయినా తమ వారసులకు ఉద్యోగాలు వస్తాయని మెడికల్ బోర్డుకు వెళ్లిన తమకు ఈ నిర్ణయం ఆందోళన కలిగించిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి యాజమాన్యం స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

7న సింగరేణి పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్

శ్రీరాంపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7వ తేదీన సింగరేణి పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 5 బ్రాంచీలలో 300 సీట్లుంగా, గతంలో 234 సీట్లు భర్తీ అయ్యాయన్నారు. మిగిలిపోయిన 68 సీట్లు (సివిల్-27, కంప్యూటర్-1, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్-5, మెకానికల్-24) సింగరేణి మేనేజ్‌మెంట్ కోటా, ప్రభుత్వ కన్వీనర్ కోటాలో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా సీట్ల కోసం విద్యార్థులు సింగరేణి పాలిటెక్నిక్ వెబ్ పోర్టల్ ద్వారా దరఖాస్తు లు సమర్పించాలన్నారు. దరఖాస్తు ప్రింట్ అవుట్, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ (మూడు జతలు), 17 వేల రూపాయలు (ఫోన్ పే, గూగుల్ పే ద్వారా చెల్లించేందుకు వీలుగా) ఈ నెల 7వ తేదీన ఉదయం ఎనిమిది గంటలకు పాలిటెక్నిక్ కళాశాలలో హాజరు కావాలని సూచించారు. కొన్ని కళా శాలల్లో వార్షిక ఫీజును 39 వేల రూపాయ లు తీసుకుంటుండగా, సింగరేణి యాజమాన్యం 17 వేల రూపాయల ఫీజు మాత్రమే స్వీకరిస్తుందని వివరించారు.

ఉత్పత్తిపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తిపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ సూచించారు. గత నెల సాధించిన ఉత్పత్తి, ఉత్పాదకతను పరిశీలించి ఆగస్టు నెలలో కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని ఆదేశించారు. పని ప్రదేశాల్లో రక్షణను మరువవద్దని సూచించారు. ఓసీపీలలో ఓబీ వెలికితీసే కంపెనీకి నిర్దేశించిన ఓబీని తొలగించి బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, రవి కుమార్, ఇందారం ఓసీపీ పీవో వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎంలు అనిల్‌కుమార్, రాజన్న, ఆనంద్‌కుమార్, మల్లయ్య, ఏరియా రక్షణాధికారి విజయ్‌కుమార్, సర్వే అధికారి నర్సింగరావు, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, సీహెచ్‌పీ ఎస్ఈ చంద్రలింగం, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మీ, సెక్యూరిటీ విభాగం అధికారి జక్కారెడ్డి పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

మంత్రి వివేక్‌వెంకటస్వామి



నివాళులర్పిస్తున్న మంత్రి వెంకటస్వామి

రామకృష్ణాపూర్, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): గని ప్రమాదంలో మృతి చెందిన రాసపల్లి శ్రావణ్‌కుమార్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలించి నివాళులు అర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. పని స్థలంలో సైడ్ వాల్ కూలి శ్రావణ్ మృతి చెందడం బాధాకరమన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికుడి కుటుంబానికి రావాల్సిన బెనిఫిట్స్‌తో పాటు ఇతరత్ర చర్యలు చేపట్టే దిశగా కృషి చేస్తానన్నారు. మంత్రి వెంట ఏఐటీయుసీ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

యాజమాన్య నిర్లక్ష్యం వల్లే కార్మికుడి మృతి...

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

యాజమాన్య నిర్లక్ష్యం కారణంగానే శ్రావణ్‌కుమార్ మృతి చెందాడని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మండిపడ్డారు. శనివారం కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం మాట్లాడారు. ఎస్‌డీఎల్ యంత్రం మొరాయిస్తుందని తెలిసినప్పటికీ ఆ పని స్థలంలోకి శ్రావణ్‌ను పంపడం సరికాదన్నారు. యాక్టింగ్ ఆపరేటర్‌గా సింగరేణిలో నైపుణ్యం లేని వ్యక్తులను పని స్థలాల్లోకి పంపడం కారణంగానే ఇటువంటి ప్రమాదాలు తరుచుగా జరుగుతున్నాయని మృతుడి కుటుంబ సభ్యులకు సింగరేణి అందించాల్సిన బనిఫిట్స్‌తోపాటు అదనంగా కోటి రూపాయల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజా రమేశ్, టీబీజీకెఎస్ నాయకులు మేడిపల్లి సంపత్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ఉన్నారు.

మందమర్రిరూరల్ : మండలంలోని పొన్నారం, ఆదిల్‌పేట గ్రామాల మీ దుగా రసూల్‌పల్లి వరకు ఉన్న రోడ్డు కంకర తేలి ప్రమాదంగా మారిందని, నూతన రోడ్డును మంజూరు చేయాలని కోరుతూ మంత్రి వివేక్‌వెంకటస్వామికి శనివారం బీజేపీ నాయకులు సంజీవరావు, వెంకటేష్‌లు వినతి పత్రం అందించారు.9 గ్రామాలుగా అనువుగా ఉన్న ఈ రోడ్డు కంకర తేలి అధ్వాన్నంగా మారిందని, ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే ప్రయాణికులు భయపడుతున్నారని తెలిపారు. ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారన్నారు. వెంటనే నూతన రోడ్డును నిర్మించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

చెన్నూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 10న నిర్వహించనున్న రెడ్డి ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లను సంఘం నాయకులు శనివారం చెన్నూరులో విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ ఈనెల 10న ఎల్లక్కపేట బీఎంఆర్ గార్డెన్స్‌లో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంన గర్, వరంగల్ జిల్లాలకు సంబంధించిన రెడ్డి బంధువుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిలుగా రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్ట శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ రచయిత్రి తంగెళ్ల శ్రీదేవిరెడ్డి హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా.. పేదలకు చేరువగా



లక్షెట్టిపేట 30 పడకల ఆసుపత్రి

లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్లు ప్రారంభం..
అన్ని హంగులతో ఓటి
అందుబాటులో అనుభవం గల వైద్యులు

లక్షెట్టిపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సైతం కార్పొరేటు స్థాయి వైద్యం అందించాలన్న లక్ష్యంతో లక్షెట్టిపేటలో ఇటీవల సకల సౌకర్యాలతో కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వం 30పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసింది. అయితే ఆ ఆస్పత్రిలో ఆపరేషన్లు కూడా చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. గర్భిణుల కోసం ప్రత్యేకంగా స్త్రీల వైద్య నిపుణురాలిని కూడా ఇక్కడి ఆ సుపత్రిలో 24గంటల వైద్య సేవలు అందించేందుకు అటు అధికార యంత్రాంగం ఇటు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆపరేషన్‌కు అవసరమయ్యే న్యూటెక్నాలజీతో ఏర్పాటు చేసిన థియేటర్‌తో పాటు ల్యాబ్, మందులు కూడా పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చారు. వారం రోజుల క్రితం ఎంఎస్ గైనకాలజిస్టు డాక్టర్ స్రవంతి రావు స్త్రీల ప్రత్యేక నిపుణురాలిగా ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. అంతే కాకుండా ఆపరేషన్ చేసే సమయంలో అనస్థీషియా డాక్టర్‌తో పాటు పిల్లల ప్రత్యేక నిపుణురాలు డాక్టర్ పవిత్ర కూడా ఆసుపత్రిలో కేటాయించారు. పేద ప్రజలు ఇక నుంచి డెలివరీల కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి లక్షలు ఖర్చు చేసుకోకుండా ఉండేందుకు ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు ఇక్కడ ఆసుపత్రి నిర్మాణం చేపట్టి పైసా ఖర్చు లేకుండా వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేయించారు.



గర్భిణుల కోసం అన్ని హంగులతో ఏర్పాటు చేసిన ఆపరేషన్ థియేటర్

దినదినం పెరుగుతున్న ఓపీ...

లక్షెట్టిపేటలో నూతనంగా నిర్మాణం చేపట్టి అన్ని హంగులతో ఏర్పాటు చేసిన 30పడకల ఆసుపత్రితో ది నదినం ఓపీ సేవలు అనుకున్న స్థాయికంటే రెట్టింపు అవుతున్నాయి. గతంలో కనీసం 50లోపు కూడా లేని ఓపీ ఇప్పుడు ఏకంగా రోజుకు 300కు పైగా వస్తున్నట్లు ఆసుపత్రి వైద్యులు చెబుతున్నారు. ఇక్కడి ప్రాంతం ప్రజలే కాకుండా పక్క జిల్లాల అయిన జగిత్యాల, నిర్మల్ నుంచి కూడా ఇక్కడికి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు అందుబాటులో ల్యాబ్ పరీక్షలతో పాటు మందులు కూడా అందుబాటులో ఉండటంతో నిత్యం వచ్చే రోగులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా నెలలు పూర్తి చేసుకున్న గర్భిణులకు ఇక్కడ కేవలం నార్మల్ డెలివరీ మాత్రమే చేసేవారు. ఒక వేళ తప్పనిసరి ఆపరేషన్ చయాల్సి ఉంటే మంచిర్యాల మాతా శిశుకు రిఫర్ చేసేవారు. కానీ ఇక నుంచి ఆపరేషన్లు కూడా ఇక్కడే చేస్తామని ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయి

డాక్టర్ శ్రీనివాస్, ఆసుపత్రి సూపరింటెండెంట్



లక్షెట్టిపేటలో గర్భిణుల కోసం ఆపరేషన్ థియేటర్‌తో పాటు ల్యాబ్ సేవలు, అన్ని రకాల మందులు, స్త్రీల కోసం ప్రత్యేకంగా వార్డును కూడా అందుబాటులో ఉంచాము. తల్లి పిల్లల ఆరోగ్యం విషయంలో అనుభవం గల వైద్యులు కూడా అందుబాటులో ఉన్నారు. ప్రజలు, గర్భిణులు ఎవరూ ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించుకుని డబ్బులు వృథా చేసుకోకూడదు. ప్రజల ఆరోగ్యం విషయంలో ఎలాంటి వైద్య సేవలు కావాలన్న లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పొందొచ్చు.

మానవత్వం చాటిన ఆర్‌కే 7 ఉద్యోగులు

గాయపడిన ఆవు సంరక్షణశాలకు తరలింపు

శ్రీరాంపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదంలో గాయపడి నడవలేనిస్థితిలో ఉన్న ఆవును జంతు సంరక్షణ శాలకు తరలించి ఆర్‌కే 7 ఉద్యోగులు మానవత్వం చాటుకున్నారు. శనివారం ఉదయం షిఫ్ట్ పూర్తి చేసుకొని మారపల్లి సారయ్య, నాగరాజు, రాజ్‌కుమార్, చిలక రమేష్ ఇంటికి వెళ్తున్నారు. అదే సమయంలో ప్రమాదంలో గాయపడి రోడ్డుపై పడి ఉన్న ఓ ఆవును చూశారు. అక్కడ ఆగి పరిశీలించగా, ఆవు నడవలేని స్థితిలో ఉంది. వెంటనే వారు జీఎం శ్రీనివాస్‌కు తెలియజేయగా, ఆయన సహాయం చేసేందుకు క్రేన్‌ను పంపించారు. అంతేకాకుండా రామకృష్ణాపూర్ జంతు సంరక్షణ శాల బాధ్యులు శ్రీధర్, రాజసమ్మయ్యకు విషయాన్ని తెలిపారు. అందరూ కలిసి క్రేన్ ద్వారా ఆవును ఆటో ట్రాలీలో ఎక్కించి పంపించారు.

వెంటాడుతున్న చేదు జ్ఞాపకాలు..

(5వ పేజీ తరువాయి)

నిర్మించిన ఆసుపత్రికి సుమారు రూ. 3 కోట్ల విలువగల అధునాతన పరికరాలు, ఇతర సామగ్రి మంజూరు కావడంతో గర్భిణులు, బాలింతలు, శి శువులు సుమారు 200 మంది వరకు చికిత్స పొం దుతుంటారు. 2022 జూలైలో కురిసిన వర్షాలకు గోదావరి ఉప్పొంగడంతో వరదలు ఆస్పత్రి భవనాన్ని ముంచెత్తాయి. ముందే ఊహించిన ఆస్పత్రి వైద్యులు చికిత్స పొందుతున్న రోగులను రాత్రికి రాత్రే జిల్లా ఆసుపత్రికి తరలించడంతో ప్రమాదం తప్పింది. గర్భిణులు, పిల్లల చికిత్సకు అవసరమైన ల్యాబ రేటరీలు, అల్ట్రా సౌండ్ ఎక్స్‌రే యంత్రాలు, ఇతర అధునాతన పరికరాలు, లేబర్ రూం, ఆపరేషన్ థియేటర్ కింద అంతస్థులో ఉండగా పై అంతస్థులో బాలింతలు చికిత్స పొందుతుంటారు. రోగులను భవనం నుంచి తరలించినప్పటికీ సుమారు రూ. 3 కోట్ల విలువ చేసే పరికరాలతోపాటు అత్యంత ఖరీదైన మందులు నీటిపాలయ్యాయి. ఆ తరువాత రెం డేళ్ల వరదలు రావడంతో రాత్రికి రాత్రే రోగులను అక్కడి నుంచి తరలించారు. ప్రస్తుతం వర్షాకాలం కా వడంతో మళ్లీ ప్రమాదం పొంచి ఉంది.

కరకట్టల నిర్మాణమే పరిష్కారం...

మంచిర్యాల పట్టణాన్ని ముంచెత్తుతున్న వరదలని వారణకు కరకట్టల నిర్మాణమే పరిష్కారం చూపనుంది. రాళ్లవాగు బ్యాక్ వాటర్ కారణంగా మంచిర్యాల పట్టణం నీట మునుగుతుండటంతో కరక ట్టల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు కృషితో కరకట్టలు మంజూరుకాగా, ఇటీవల పనులు కూడా ప్రారంభించారు. రూ. 250 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టగా, వచ్చే వర్షాకాలం నాటికి పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. కరకట్టల నిర్మాణం పూర్తయితే మంచిర్యాల పట్టణానికి వరదల నుంచి విముక్తి లభించినట్లు అవుతోంది.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

చెన్నూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. శనివారం చెన్నూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్మించనున్న గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పి స్తుందన్నారు. విద్యను ప్రోత్సహించడంలో పాఠశాలల పాత్ర ఎంతో ముఖ్యమైందని తెలిపారు. ఉపాధ్యాయులందరు విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



ఇందారంలో పాల్గొన్న సూపర్ వైజర్ కవిత

లక్షెట్టిపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మమత, వాణి అన్నారు. లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల, మోదలతో పాటు మండలంలోని వెంకట్రావుపేటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ను అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మమత, వాణి మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు చాలా శ్రేష్టమని పుట్టిన బిడ్డకు 6 నెలల వరకు తల్లిపాలనే పట్టించాలన్నారు. బిడ్డ పుట్టిన తర్వాత మొదటగా వచ్చేవి ముర్రు పాలని వాటిలో పోషకపదార్థాలు అధికంగా ఉంటాయన్నారు. 7వ నెల నుంచి పిల్లలకు 2 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు పోషక పదార్థాలున్న ఆహారాన్ని అందించాలన్నారు. డాక్టర్ మౌని క, హెచ్‌ఎం తిరుపతి, ఏఎన్ఎంలు సరస్వతి, జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు శారధ, సుగుణ, వసంత, స్వప్న, ప్రతిభ గర్భిణులు పాల్గొన్నారు.

జైపూర్ : మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను శనివారం మండంలోని ఇందారం 4 అంగన్‌వాడీ కేంద్రలో ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత పాల్గొని మాట్లాడారు. ఈ నెల 7 వరకు అంగన్ వాడీ కేంద్రాల్లో వారోత్సవాలు ఉంటాయన్నారు. అంగన్‌వాడీ టీచర్లు సౌజన్య, కళ్యాణి పాల్గొన్నారు.

దేశ ప్రజల హక్కుల కోసం పోరాడాలి : ఎంపీ



ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో ఎంపీ వంశీ కృష్ణ

మందమర్రిటౌన్, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల హక్కులరక్షణ కోసం పోరాడాలని ఆ దిశగా న్యాయవాదులు, లీగల్ ఎక్స్ పర్టులు కృషి చేయాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ క్రిష్ణ తెలిపారు. శనివారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఏఐసీసీ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. న్యాయ వ్యవస్థపటిష్టతో పాటు సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పని చేస్తుందన్నారు. దేశప్రజల సంక్షేమం హక్కులే లక్ష్యంగా తమ అధినేత రాహుల్‌గాంధీ పని చేస్తున్నారన్నారు. దీనికి సంబంధించి న్యాయవాదులు కూడ ప్రజలపై జరుగుతున్న దాడులు, అన్యాయాలపై న్యాయవాదులు ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు.

ఆంక్షలు ఎత్తివేయాలి

జన్నారం, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్ పేరిట ఆంక్షలు పెట్టిన అటవీశాఖ ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు శనివారం మండల సర్పంచ్‌ల ఫోరం సభ్యులు మద్దతు పలికి దీక్షలో కూర్చున్నారు. జన్నారంలోని అభివృద్ధిని అడ్డుకుంటున్న ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాడి గంగాధర్, బద్రీ నాయక్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, రాజన్న, గంగాధర్ పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వైద్య శిబిరం

చెన్నూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా వికాస తరంగిణి ఆధ్వర్యంలో శనివారం చెన్నూరు పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాలులో మహిళల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక స్త్రీల వైద్య నిపుణురాలు అరుణశ్రీ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్య దర్శులు జాడి తిరుపతి, నిమ్మల సాగర్, సమ్మయ్య, జిల్లా వికాస తరంగిణి అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు రవీందర్, శ్రీనివాస చారి, లక్ష్మణ్‌రావు, లక్ష్మాగౌడ్, సుధీర్, అనితరెడ్డి, జగన్‌మోహిని పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ వీక్షణ

చెన్నూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టంపేట గ్రామంలోని రైతు వేదికలో శనివారం ప్రధాని నరేంద్ర మోదీ పీఎం కిసాన్‌నిధులను విడుదల చేస్తున్న వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు, అధికారులు, నాయకులు వీక్షించారు. కార్యక్రమంలో ఏవో యామిని, ఏఈవో సాయికృష్ణ, పీఏసీ ఎస్ చైర్మన్ రాంరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

మోడల్ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు

కాసిపేట, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ కాలేజీలో 6, 7 తరగతులతో పాటు ఇంటర్‌మీడియట్ ఫస్టు ఇయర్, సెకండియర్‌లో మిగిలిపోయిన సీట్లలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ఖాళీగా ఉన్న సీట్ల ప్రవేశాలకు సోమవారం స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 4వ తేదీన నేరుగా కళాశాలకు వచ్చి ఆధార్‌కార్డు జిరాక్స్‌తో సంబంధిత ధ్రువీ కరణ పత్రాలతో హాజరుకావాలన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

బెల్లంపల్లి, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వారం రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని అడా ప్రాజెక్టులో భారీగా చెత్త పేరుకపోయిందని దీంతో పట్టణంలో వారం రోజులు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ప్రజలందరూ గమనించి సహకరించాలన్నారు.

రాబోయే ఎన్నికల్లో సత్తా చాటాలి

మందమర్రిరూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని మండల బీజేపీ ఇన్‌చార్జీ దేవరనేని సంజీవరావు పేర్కొన్నారు. శనివారం దుబ్బపల్లిలో నాయకులతో సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుపొందేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో జనార్ధన్, దీక్షితులు, వెంకటేష్, రాజయ్య, రవికుమార్, మల్లేష్, శ్రీనివాస్, మల్లేష్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

తాండూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల కమిటీని శనివా రం తాండూర్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు దూడపాక భరత్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షులుగా కొండు రవి, రేవెల్లి శ్రీనివాస్, తాళ్లపల్లి రవిగౌడ్, ఆత్రం సావిత్రి, ప్రధాన కార్యదర్శులుగా పుట్ట కుమార్, మామిడి విగ్నేష్, కార్యదర్శులుగా కుంచె గణేష్, సాయిగౌడ్, రాజే శం, తిరుమలేష్, కోశాధికారిగా సురేష్, కార్యవర్గ సభ్యులుగా చిత్రు, సావిత్రి, స్వప్న, రమాదేవి, సతీష్, అరుణ్, బాపు, రమేష్, శ్రీనివాస్, అరుణ్, శ్రీనివాస్, చరణ్, రాజ్‌కుమార్, రాకేష్, సాత్విక్, విజయ్, హరీష్, తిరుపతి, మహేష్, గోవర్ధన్, వెంకటేష్, మోహన్, రమేష్‌లను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, నాయకులు మహీదర్ గౌడ్, శేషగిరి, ప్రదీప్ పాల్గొన్నారు.

సర్కార్ బడికి పూర్వ విద్యార్థులు వితరణ

దండేపల్లి ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపేట ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలోని చదువుకునే విద్యార్థుల కోసం పూర్వ విద్యార్థులు డెస్క్ బెంచీల కోసం రూ. 38,500 పాఠశాలకు వితరణ చేశారు. చదువుకున్న సర్కార్ బడికి ఏదో ఒకటి చేయాలని ఉద్దేశ్యంతో ఇదే పాఠశాలోని 2002-03లో చదువుకున్న పూర్వ విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత బడికి వెళ్లి విద్యార్థుల ఇబ్బందులను గుర్తించారు. దీంతో పూర్వ విద్యార్థులు డబ్బులను పోగు చేసి డెస్క్ బెంచీల కోసం డబ్బులను పాఠశాల ప్రదానోపాధ్యాయుడు సుదర్శన్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన సురక్షణ క్యాంపు

నెన్నెల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై అవగాన కల్పించేందుకు గొళ్లపల్లిలో శనివారం జన సురక్షన క్యాంపు నిర్వహించారు. నెన్నెల శాఖ ఫీల్డ్ ఆ ఫీసర్ భానుప్రసాద్ మాట్లాడుతూ అతి తక్కువ ప్రీమియంలతో ఉన్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీమా యోజనలో రూ. 20 చెల్లిస్తే రూ. 2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. జీవన జ్యోతి పథ కంలో రూ. 436ల వార్షిక ప్రీమియంతో రూ. 2 లక్షల బీమా వస్తుందన్నారు. ఈ పథకం సాదారణ మరణానికి కూడా క్లైం అవుతుందన్నారు. ఫీల్డ్ ఆఫీసర్ విక్రమ్, అకౌంటెంటు ప్రకాష్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గని వద్ద కార్మిక సంఘాల ఆందోళన

మందమర్రిటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి ఏరియాలోని కేకే 5 గని వద్ద శనివారం కార్మిక సంఘాలు ఆందోళన చేపట్టాయి. శుక్రవారం రెండవ షిఫ్టులో యాక్టింగ్ ఎస్‌డీఎల్ ఆపరేటర్ శ్రావణ్ మృతికి నిరసనగా గని వద్ద బైఠాయించారు. జాతీయ సంఘాలు, టీబీజీకేఎస్ కూడా ఆందోళనలో పాల్గొంది. అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ గనిలో నిబంధనలకు విరుద్ధంగా పనులు నిర్వహిస్తున్నారన్నారు. మూడు షిఫ్టులు కొనసాగించాలని ఉండగా ఆరు షిఫ్టులు కొనసాగించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, పాల్గొన్నారు.

ఘనంగా కోటి పార్థీవ లింగార్చన మహోత్సవం

జన్నారం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోటి పార్థీవ లింగార్చన మహోత్సవాన్ని శనివారం మండల కేంద్రంలో పట్టణ ఆలయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కలశ స్థాపన, గణపతి, గౌరి పూజ, నవగ్రహాల ఆరాధన, 108 మంది భక్తులు పుట్ట మన్ను చేత పార్థీవ లింగాలను తయారు చేసి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. బాసర శివయోగి, నిర్మల అంజయ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో 90 లక్షల శివలింగాలను భక్తులతో చేయించారు. మహిళలు దేవరశెట్టి రజిత మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు భూమేశ్, కిరణ్ పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ తక్షణమే విడుదల చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్ తక్షణమే విడుదల చేయాలని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ పేర్కొన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేసి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను పట్టించుకోకుండా మోసం చేస్తుందన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయకుండా వారి జీవితాలను నాశనం చేస్తుందన్నారు. నిరుద్యోగులకు రూ. 4 వేల నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి నేటి వరకు కూడా అమలు చేయక పోవడం చాలా దారుణమన్నారు. వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకారం వెంటనే ఉద్యోగాలను భర్తీ చేయాలని లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయక్, అజయ్, చంద్ర, కిరణ్, సాయి కృష్ణ, శివ, నరేష్, సాగర్, అజయ్, సాయికిరణ్, సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఐ బదిలీ నిలిపివేయాలి




తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

కాసిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ అడె కమల బదిలీని నిలిపివేయాలని కోరుతూ శనివారం తుడుం దెబ్బ, గిరిజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్ భోజన్నతో వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ మండల అధ్యక్షు లు సండ్ర భూమన్న మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన మండలంలో ఆర్‌ఐగా ఆదివాసీ ఉద్యోగి అడె కమలను విధుల్లోనే కొనసాగించాలన్నారు.

ఆదివాసీ ఉద్యోగి మండలంలో కొనసాగడం వల్ల ఆదివాసీ గిరిజనులకు న్యాయం జరుగుతుందన్నారు. మండలం లోని ప్రభుత్వ భూములతో పాటు ఆదివాసీ గిరి జన భూములను గిరిజనేతరులు అక్రమంగా పట్టాలు చేసుకొని అమాయక గిరిజనులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఆర్‌ఐగా అడె కమలను కాసి పేటలోనే కొనసాగించే విధంగా ఉన్నతాధికారులు సహకరించాలని కోరారు. తుడుం దెబ్బ మండల ప్రధాన కార్యదర్శి కుర్సింగ తిరుపతి, గిరిజన సంఘాల నాయకులు అనంతరావు, బాపు పాల్గొన్నారు.

ఏపీఎంగా శ్రీనివాస్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ

భీమారం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండల నూతన ఏపీఎంగా గడ్డం శ్రీనివాస్‌గౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరిం చారు. ఇక్కడ పనిచేసిన ఏపీఎం త్రయం బకేశ్వర్ నెన్నెల మండలానికి బదిలీ కాగా శ్రీనివాస్‌గౌడ్ ఏపీఎంగా భీమారం మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య సభ్యులు ఏపీఎంకు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల సమాఖ్య సభ్యులు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.



జాతీయ స్కాలర్‌షిప్ పురస్కారాలకు ఎంపిక



స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన పూజిత, సౌమ్యశ్రీ

కోటపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు జాతీయ ప్రతిభా స్కాలర్‌షిప్ పురస్కారాలకు ఎంపికయ్యారు. పాఠశాలలో ఎంపీసీ రెండవ సంవత్సరం పూర్తి చేసిన పడాల పూజిత 954 మార్కులు సాధించి అత్యంత ప్రతిభ కనబర్చింది. అలాగే పాలిక సౌమ్యశ్రీ బైపీసీ విభాగంలో 984 మార్కులు సాధించి ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రాజశేఖర్ పేర్కొన్నారు. వీరికి మూడు సంవత్సరాల డిగ్రీలో సంవత్సరానికి రూ. 10 వేల చొప్పున, రెండు సంవత్సరాల పోస్టు గ్రాడ్యుయేషన్‌లో సంవత్సరానికి రూ. 20 వేల చొప్పున మొత్తంగా ఒక్కొక్కరికి రూ. 70 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందనుంది. ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

రథయాత్ర కరపత్రాలు విడుదల

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో శనివారం బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు మా భూమి రథయాత్ర కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ డాక్టర్ విశారదన్ మహారాజ్ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికారం కోసం చేపట్టిన లక్ష కిలోమీటర్ల మా భూమి పాదయాత్ర ఆదిలాబాద్‌లో ప్రారంభమైందన్నారు. ఈ యాత్ర ఈ నెల 6న మంచిర్యాలకు చేరుకుంటుందని, నాయకులు, కార్యకర్తలు, మేధావులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, సదానందం, రామస్వామి, రాజు, రాకేష్, చంద్రశేఖర్, సురేందర్, వెంకటేష్, శ్రీనివాస్, వెంకన్న, భీమ్‌సేన్, బిక్షపతి, అశోక్, రాయమల్లు, అశోక్, రాజేశం,వెంకటేష్, సతీష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

దండేపల్లి ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం ఆల్లీపూర్‌లో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు లింగంపల్లి బాపన్న, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా సభ్యుడు బచ్చల అంజన్నలు శనివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు కొత్తపల్లి రాజయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంతెన నవీన్ కుమార్, నాయకులు సుభాష్, చిరంజీవి, సంతోష్, పున్నం, సతీష్ నర్సయ్య, రాజేందర్, గంగయ్య, నారాయణ, వరుణ్, మణిచందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ఉధృతంగా ప్రవహిస్తున్న రాళ్లవాగు (ఫైల్)



నీట మునిగిన మాతా శిశు ఆసుపత్రి భవనం (ఫైల్)

వెంటాడుతున్న చేదు జ్ఞాపకాలు

- ప్రజల మదిలో మెదులుతున్న రాళ్లవాగు ఉధృతి
- 48 గంటలు నీటిలోనే ఏడెనిమిది కాలనీలు
- ఎంసీహెచ్‌కు నేటికీ పొంచి ఉన్న ప్రమాదం
- కరకట్టల నిర్మాణంతోనే పరిష్కారం

మంచిర్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వస్తోందంటే చాలు...మంచిర్యాల పుర ప్రజలను చేదు జ్ఞాపకాలు వెంటాడుతుంటాయి. మూడేళ్లు గడుస్తున్నా... వారి మదిలో ఇంకా రాళ్లవాగు ఉధృతి మెదులుతూనే ఉంది. 2022 జూలై 13న వరదలు మంచిర్యాల పట్టణాన్ని ముంచెత్తాయి. ఊహించని రీతిలో రాళ్లవాగు ఉప్పొంగి ఏడెనిమిది కాలనీలు పూర్తిగా 48 గంటలపాటు నీటిలోనే మగ్గాయి. ఆ తరువాత వరుసగా రెండేళ్లు కూడా పట్టణాన్ని వరదలు ముంచెత్తాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడం, వరదల నివారణకు ఇంకా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో చేదు జ్ఞాపకాలు పునరావృతం అవుతాయేమోనన్న భయం ప్రజల్లో నెలకొంది.

రాళ్లవాగులో మునిగిన కాలనీలు..

రెండేళ్లుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో పరివాహక ప్రాంతాలు నీట మునిగాయి. నదిలో చేరే అవకాశం లేక రాళ్ల వాగు, తోళ్లవాగుల్లో వరదనీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి పోటు కమ్మాయి. రాళ్లవాగు బ్యాక్ వాటర్ కారణంగా జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల, రెడ్డి కాలనీ, ఎల్ఐసీ కాలనీ, రాంనగర్, ఎన్టీఆర్ నగర్, బైపాస్ రోడ్డు, ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో పెద్ద మొత్తంలో ఇళ్లు మొదటి అంతస్తు వరకు నీట మునిగాయి.

అలాగే తోళ్లవాగు నీరు కూడా నివాస గృహాలదరిదాపుల్లోకి చేరింది. పెద్ద మొత్తంలో వరద ఇళ్లలో నడుంలోతు వరకు చేరడంతో బాధితులు కట్టుబట్టలతో బయటకు రావలసిన పరిస్థితి నెలకొంది. బాధితులను అధికారులు తెప్పలు, పడవల పై ముందస్తుగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల తరలించారు. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు గత ఆగస్టు 22, 23 తేదీలలో సర్వే జరిపి నీటి ప్రవాహాన్ని అంచనా వేశారు. కాసిపేట మండలంలోని దేవాపూర్‌లో పుట్టిన రాళ్లవాగు అటవీ ప్రాంతం గుండా ప్రవహించి జిల్లా కేంద్రానికి చేరుకుంటుంది.

స్థానిక ఆర్ఆర్‌నగర్, కార్మెల్ హైస్కూల్, గౌతమీ నగర్, రెడ్డి కాలనీ, పాత మంచిర్యాల, రాంనగర్, ఎన్టీఆర్ కాలనీల మీదుగా ప్రవహించి గోదావరిలో కలుస్తుంది. రెండేళ్ల క్రితం జూలైలో కురిసిన వర్షాల కారణంగా రాళ్లవాగులో 139.20 మీటర్ల ఎత్తున నీరు ప్రవహించినట్లు అధికారు లు గుర్తించారు. పాత మంచిర్యాల వంతెన వద్ద 48006.35 క్యూసెక్కుల నీరు వాగుగుండా ప్రవహిం చినట్లు నిర్ధారణకు వచ్చారు. అలాగే తోళ్లవాగుకు పై ఉన్న చింతల చెరువు నుంచి వరద తాకిడి పెరగడంతో సాయికుంట ప్రాంతంలోని నివాస గృహాల్లోకి నీరు చేరింది.

పొంచి ఉన్న ముప్పు..

వరుసగా రెండేళ్లుగా కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లా కేంద్రంలో జనజీవనం అతలాకుతలం అయింది. అంతకు ముందు సంవత్సరం 2022 జూలై 13న కుండ పోతగా వర్షం కురవడంతో జిల్లా కేంద్రంలోని వాగులు పొంగిపొర్లి గోదావరి ఉప్పొంగింది. ఈ కారణంగా వాగుల్లో నీరు ఎదురెక్కి నివాస గృహాల్లోకి చేరింది. అర్ధరాత్రి ఒక్కసారిగా వరదలు రావడంతో ప్రజలు తేరుకొనేలోపే కాలనీలు నీట మునిగాయి. భారీ వరదల కారణంగా ఏడెనిమిది కాలనీలు 48 గంటల పాటు నీటిలోనే మగ్గాయి. తిరిగి తరువాత సంవత్సరం జూలైలో కురిసిన వర్షాలకు మళ్లీ అయా కాలనీలు నీట మునిగాయి. దీంతో ముందస్తుగా ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకున్న అధికార యంత్రాంగం పునరావాస కాలనీలను ఏర్పాటు చేసి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ప్రతీ యేటా ముంపే...

గోదావరి వదర కారణంగా జిల్లా కేంద్రంలోని మాతా, శిశు సంరక్షణ కేంద్రానికి (ఎంసీహెచ్) నేటికీ ప్రమాదం పొంచి ఉంది. గోదావరి సమీపంలో ఉండటంతో ప్రతియేటా వర్షాకాలంలో ఆసుపత్రి భవనం ముంపునకు గురవుతోంది. 2017-12-22న నేషనల్ హెల్త్ స్కీం పథకంలో భాగంగా 100 పడకలతో కూడిన ఎంసీహెచ్ నూతన ఆస్పత్రి మంజూరైంది. రూ. 17 కోట్ల అంచనా వ్యయంతో..

(మిగతా 7లో)

భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

కన్నెపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య పేర్కొన్నారు. శనివారం కన్నెపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భారతిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరగా పరిష్కరించాలన్నారు. మండలంలోని విద్యార్థులు, రైతులకు, ప్రజలకు అవసరమైన ధృవకీరణ పత్రాలను నిర్ణీత సమయంలోగా జారీ చేయాలని సూచించారు. అధికారులు సమయ పాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రావణ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా చూడాలి

చెన్నూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా చూడాలని కొమ్మెర ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ సూచించారు. శనివారం కొమ్మెర సబ్‌స్టేషన్ పరిధిలోని లైన్‌మన్‌లతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్క లైన్‌మన్ ఎల్‌సీ ఆప్ ద్వారా తీసుకుని భద్రత ప్రమాణాలు పాటిస్తూ నిబద్ధతో పనిచేయాలన్నారు. విద్యుత్ మోటార్ల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. విద్యుత్ బిల్లులను వంద శాతం వసూలు చేయాలన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన

జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్

కోటపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే ప్రజా సంక్షేమం, సుస్థిర పాలన అందుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని పుల్లగామ గ్రామంలో పార్టీ మండల అధ్యక్షురాలు పెద్దింటి స్వప్నపున్నంచంద్ అధ్యక్షతన రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఆయుష్మాన్ భార త్, ఉచిత బియ్యం , రైతుకు ఎకరాకు 2 వేల చొప్పున సంవత్సరానికి రూ. 6 వేలు తదితర పథకాలపై ప్రజలకు వివరించారు. అభివృద్ధి ప్రతి గడపకూ చేరాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ,డబుల్ ఇంజన్ సర్కారు తీసుకురావాలని, దీంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ దుర్గం అశోక్, మండల ఎన్నికల కన్వీనర్ మంత్రి రామయ్య, భీమారం మండల కన్వీనర్ కాశెట్టి నాగేశ్వర్‌రావు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజ్



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

కాసిపేట, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజ్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులతో పాటు కీటకజనిత వ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అత్యవసరమైతే తప్ప ఎవరు కూడ విధులకు గైర్హాజరు కావద్దు. వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. మండలంలోని రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలతో పాటు ఆశ్రమ పాఠశాలలు, మోడల్ హాస్టల్ కేజీబీవీ హాస్టల్‌లో పరిస్థితులను, వంట విధానాలను పరిశీలించి విద్యార్థులకు సీజనల్‌లో వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. జ్వరాలను నియంత్రించడంలో వైద్య సిబ్బంది అందరూ సమిష్టిగా కలిసి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో సప్దర్ అలీ, వైద్య సిబ్బంది శ్రీనివాస్, చంద్రశేఖర్, రజిని, జ్యోతి, డాక్టర్ రవికిరణ్, డాక్టర్ శ్రీదివ్య హెల్త్ అసిస్టెంట్ నారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ గోపి పాల్గొన్నారు.

సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి



ఇందారం వద్ద రోడ్డును పరిశీలిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్, సీఐ, ఎస్ఐ

జైపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ రహదారిపై ప్రమాద స్థలాలను గుర్తించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఇందారం రాజీవ్ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందారం బస్టాండ్ వద్ద, ఇందారం ఓపెన్‌కాస్టుగనికి వెళ్లే దారిలోప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని హెచ్‌కేఆర్ రోడ్‌వేస్ అధికారులకు సూచించారు. వాహనదారులు నేరుగా రోడ్డుపైకి రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, సర్వీసు రోడ్డుకు ఉన్న ఇనుప జాలీలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో సూచిక బోర్డులు, స్టాపర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్‌సీఐ వేణుచందర్, ఎస్ఐ శ్రీధర్, రోడ్‌వేస్‌మేనేజర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని.. 30 పడకల ఆసుపత్రిగా మార్చాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

జన్నారం, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా మార్చాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైల్ల ఆశయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్యాన్ని అడిగి తెలుసుకున్నారు. మండలంలో అత్యధికంగా అడవిలో ఉండే ఆదివాసీలు, గిరిజనులు మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రికి వస్తుంటారని ఇక్కడ సరైన వసతులు లేక చికిత్స పొందేం దుకు అన్ని రకాల వైద్య సేవలు లేవన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడల ఆసుపత్రిగా తీర్చిదిద్దితేనే ఈ టైగర్‌జోన్‌లో ఉండే ఆదివాసీ గిరిజనులతో పాటు పేద బడుగు బలహీనవర్గాలకు వైద్యం అందుతుం దన్నారు. ఆయన వెంట సీపీఎం మండల నాయకులు కనికరపు అశోక్, బుచ్చయ్య, రాజన్న, జయ, ప్రమీల, లక్ష్మణ్, అబ్దుల్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

బెల్లంపల్లి, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): వర్షాకాల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుదాకర్ నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని శంషీర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గ్రామాల్లో వైద్యులు ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో బెల్లంపల్లి కమ్యూనిటి హెల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మంత్రి వివేక్ వెంకటస్వామి

మందమర్రిటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని, అడవుల సంరక్షణ, మొక్కల పెంపకానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఉపాధి కల్పన, గనుల, కార్మిక శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి తెలిపారు. శనివారం పట్టణంలోని వెంకటేశ్వర్ టెంపుల్ ఏరియా కోల్‌బెల్ట్ రోడ్డు పక్కన యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. మున్సిపల్ కమీషనర్ రాజలింగుతో కలిసి మొక్కలు నాటారు.

మంత్రి మాట్లాడుతూ మానవాళి మనుగడ మొక్కలతోనే ముడిపడి ఉందన్నారు. రాష్ట్రంలో మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నర్సరీల్లోని మొక్కలను సంరక్షించి నాటాలన్నారు. ప్రతి ఒక్కరు ఆరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కాలుష్య నివారణ, స్వచ్ఛమైన గాలి చెట్లతోనే సాధ్యమవుతుందన్నారు. మందమర్రి మున్సిపాలిటీలో మొక్కలు నాటి సంరక్షించాలని కమీషనర్‌కు సూచించారు. అనంతరం మంత్రిని డ్వాక్రా గ్రూపు మహిళలు, యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. అనంతరం పలువురు సమస్యలపై వినతి పత్రాలు అందించారు. మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మందమర్రిలో మొక్కలు నాటుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

దసలి పట్టు పరిశ్రమ రైతుల సమస్యలను పరిష్కరించండి

చెన్నూరు : దసలి పట్టు పరిశ్రమపై ఆధారపడిన రైతులపై జీవిస్తున్న ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు శనివారం మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతి పత్రం అందించారు. మూడు తరాలుగా అడవి పై ఆధారపడి అడవిలోని మద్దిచెట్లపైన పట్టు పురుగులను పెంచి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. దసలిపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీలను అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఆదివాసీలను వేధిస్తున్న అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రవి, టీపీ జీఎస్ జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం, ఐద్వా జిల్లా కార్యదర్శి ఉమారాణి, ఆదివాసీ నాయకులు జయశ్రీ, సమ్మక్క, జ్యోతి, రాజేశ్వరి, రాజేందర్, రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

కాసిపేట ఏపీఎంగా రాజ్‌కుమార్

కాసిపేట, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): కాసిపేట ఇందిరాక్రాంతి పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్‌గా రాజ్‌కుమార్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఐకేపీ సిబ్బంది ఆయనకు పూల బొకే ఇచ్చి స్వాగతం పలికారు. ఇక్కడ పని చేసిన వెంకటేశ్వర్లు హాజీపూర్‌కు బదిలీపై వెళ్లడంతో జైపూర్ నుంచి రాజ్‌కుమార్ కాసిపేట ఏపీఎంగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికి పాటుపడతానన్నారు.

సీపీఎస్ రద్దు చేసేంత వరకు పోరాటం

కోటపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం ప్రవేశ పెట్టేంత వరకు ఉద్యమిస్తామని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సభ్యత్వన మోదును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేసి ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. 20 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని పాత పెన్షన్ విధానం పునరుద్ధరించేంత వరకు ప్రభుత్వంపై పోరాటాలు చేస్తామన్నారు. దీని కోసం సెప్టెంబరు 1న విద్రోహదినం పాటిస్తామని, అదే రోజు హైద్రాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద వేలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులతో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ధర్నాకు ఉపాధ్యాయులంతా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణమూర్తి, సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతయ్య, మండల ప్రధాన కార్యదర్శి కోమట్ల బాపు, ఉపాధ్యక్షుడు వారణాసి నాగేందర్, ఉపాధ్యాయులు చంద్రయ్య, శ్రీదేవి, కరీం, సంతోష్, శ్రీనివాస్, గంగాధర్, వరలక్ష్మీ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు అందిస్తున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్